క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొదిలి రూరల్: ఆర్డీఎస్ఎస్ పనుల్లో భాగంగా నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నందున కాటూరివారిపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 6 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈ మోహన్‌రెడ్డి తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పొదిలి పాతూరు, దర్శిరోడ్డు, చిన బస్టాండ్ కాటూరివారిపాలెం, బుచ్చెన్నపాలెం, కొత్తపాలెం, అగ్రహారం, నేతపాలెం, కెల్లంపల్లి తదితర ప్రాంతల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు గమనించి సహకరించగలరని ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

విద్యార్థులకు చదువుపై ఆసక్తి కల్పించాలి



ప్రోత్సాహక బహుమతులు అందుకున్న విద్యార్థులు

గిద్దలూరు రూరల్: విద్యార్థులకు చదువుపై ఆసక్తి కల్పించాలని గ్రంథపాలకురాలు నల్లబోతుల ప్రసన్నకుమారి పేర్కొన్నారు. పట్టణంలోని గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం అనే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సరళంగా చదవడంపై పోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. బహుమతులను సమకూర్చిన రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి నారాయణ రెడ్డిని అభినందించారు.

తెలుగు బాప్టిస్టు చర్చి ట్రెజరర్ మృతి

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని ఏబీఎం కాంపౌండ్‌లో గల తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చి ట్రెజరర్‌చ రిటైర్డు లెక్చరర్ సి.రామస్వామి గుండెపోటుతో ఆదివారం వేకువజామున మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని పలువురు పాస్టర్లు, చర్చి కమిటీ సభ్యులు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. చర్చి అభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు మృతి



శివారెడ్డి(ఫైల్)

పొదిలి రూరల్: పొదిలి మండలం ఈగలపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పాశం శివారెడ్డి(47) ఆదివారం మృతి చెందారు. వారం రోజుల క్రితం పక్షవాతం సోకి కాళ్లు, చేతులు పడిపోవడంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ధైర్యంగా ఉండండి.. అండగా ఉంటా



పార్టీ నాయకుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

తాళ్లూరు: మండలంలోని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. తూర్పుగంగవరం గ్రామానికి చెందిన సొసైటీ మాజీ సభ్యుడు యాడిక యలమందారెడ్డి ఇటీవల ప్రమాదానికి గురయ్యాడు. అతనితో పాటు పక్షవాతంతో బాధపడుతున్న పార్టీ సీనియర్ నాయకుడు నగుళ్ల పాపయ్య నివాసానికి వెళ్లి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అదే గ్రామానికి చెందిన పార్టీ మండల కార్యదర్శి భీమని సుబ్బారావు కడుపునొప్పితో ఆపరేషన్ చేయించుకోవడం, గుజ్జుల వెంకటేశ్వరరెడ్డి (గోల్డ్) మాతృమూర్తి జి.అంకమ్మ వెన్నెముక ఆపరేషన్ చేయించుకున్న విషయం తెలుసుకుని వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని, ధైర్యంగా ఉండాలని, ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అలాగే, తాళ్లూరులోని పార్టీ సీనియర్ నాయకుడు కోటా కృష్ణారెడ్డి మాతృమూర్తి హనుమమ్మ దశదిన కార్యక్రమానికి హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బూచేపల్లి వెంట పార్టీ మండల అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గోళ్లపాటి మోషే, మండల అనుబంధ విభాగాల అధ్యక్షులు లతీఫ్, నగళ్ల గోపి, నారాయణశెట్టి, మండల నాయకులు యత్తపు మధుసూదన్‌రెడ్డి, కె.ఎస్.శ్రీనివాసరావు, పి.దేవదానం, నాగమల్లేశ్వరరెడ్డి, గోపాల్‌రెడ్డి, లతీఫ్, ఎస్.కొండారెడ్డి, గోపు శ్రీను, బాలకృష్ణారెడ్డి, తూము జయరామిరెడ్డి, సైదా, జి.వెంకారెడ్డి, పి.కోటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గిద్దలూరు : చిల్లచెట్లతో అధ్వాన్నంగా ఉన్న మిట్టమీదిపల్లె పాఠశాల



కొనకనమిట్ల : పాతపాడు హెచ్‌డీ పాఠశాలలో 35 మందికి ఒక్క టీచరే దిక్కు



మార్కాపురం: మొద్దులపల్లె ఏకోపాధ్యాయ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు

చతికిలబడిన చదువు

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం
- అడ్మిషన్లు లేక మూతపడుతున్న ప్రాథమిక పాఠశాలలు
- పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత
- బదిలీల అనంతరం సమస్య తీవ్రం

మార్కాపురం/కొనకనమిట్ల/తర్లుపాడు/గిద్దలూరు రూరల్: కూటమి ప్రభుత్వ అస్తవ్యస్త నిర్ణయాలు పేద విద్యార్థులను చదువుకు దూరం చేస్తున్నాయి. గతంలో విద్యార్థులతో కలకలలాడిన ప్రభుత్వ పాఠశాలలు నేడు నిస్తేజ స్థితిలో దర్శనమిస్తున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్ది అమ్మ ఒడి పథకాన్ని అమలు చేయడం ద్వారా డ్రాపౌట్స్‌ను నిరోధించారు. ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు క్యూకట్టడంతో నో అడ్మిషన్స్ బోర్డులు పెట్టాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు స్కూళ్లకు తాళం వేసేలా ఉన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మూతపడిన పాఠశాలలు

మార్కాపురం నియోజకవర్గంలో 6 ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి. మార్కాపురం పట్టణ, మండలంలోని ఏబీఎం లోయర్ స్కూల్, రాజుపాలెం జనరల్, భారతీయ విద్యానికేతన్, పొదిలి మండలంలోని అక్కచెరువు జనరల్, అన్నవరం, కొత్తపల్లి పాఠశాలల్లో విద్యార్థులు చేరకపోవడంతో అధికారులు మూతవేశారు. పొదిలి మండలంలోనూ పలు స్కూళ్లు మూత పడ్డాయి.

విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం

మార్కాపురం మండలంలో మొత్తం 26 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో విద్యార్థుల సంఖ్య సింగిల్ డిజిట్‌కే పరిమితమైన స్కూళ్లు 12 ఉండటం గమనార్హం. పెద్దనాగులవరం ప్రాథమిక పాఠశాలలో కేవలం ముగ్గురు విద్యార్థులు, బోడపాడు ఎయిడెడ్ స్కూల్‌లో 4, అక్కచెరువులో 6, వేములకోట ఉర్దూ స్కూల్లో 3, ఐడేఖాన్‌పేట స్కూల్లో 6, మాలపాటిపల్లి పాఠశాలలో 4, మన్నెంవారిపల్లి జనరల్ పాఠశాలలో 3, మన్నెంవారిపల్లి ఉర్దూ పాఠశాలలో 8 మంది, మొద్దులపల్లి బీసీ కాలనీ పాఠశాలలో 4, గజ్జలకొండ స్పెషల్ పాఠశాలలో 9 మంది, పిచ్చిగుంటపల్లి పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు, అమ్మవారిపల్లి ఎంపీపీ స్కూల్‌లో ఇద్దరు మాత్రమే నమోదయ్యారు. దరిమడుగు ఎస్సీ కాలనీలో 25, పట్టణంలోని 3వ వార్డులో ఉన్న ఎలిమెంటరీ స్కూల్‌లో 39 మంది, తర్లుపాడు మండలంలోని చెన్నారెడ్డిపల్లి ఏఏలో 25 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ ఇక్కడ ఒక్క టీచరే పాఠాలు బోధిస్తున్నారు. మార్కాపురం మండలంలో 15 మంది కంటే తక్కువ అడ్మిషన్లు నమోదైన పాఠశాలలు మరో ఐదుకు పైగా ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు అత్యవసరంగా సెలవు పెడితే అప్రకటిత సెలవు ఇవ్వాల్సి వస్తోంది.

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

కొనకనమిట్ల మండలంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు 30 వరకు ఉన్నాయి. వీటిలో 20 మందికి పైగా విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో కూడా ఒక్కరే టీచర్‌తోనే నెట్టుకొస్తుండటం కూటమి ప్రభుత్వ తీరుకు అద్దం పడుతోంది. పాతపాడు, చినమనగుండం, నాయుడుపేట, బసాపురం, పుట్టారివారిపల్లి హిందూ పాఠశాలల్లో, బచ్చలకూరపాడు, చౌటపల్లి, గుర్రాలమడుగు, సలనూతల, గార్లదిన్నె ఏఏ పాఠశాలల్లో 20 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. ఆయా పాఠశాలలకు బదిలీపై టీచర్లు రాకపోవడంతో ఉన్న ఒక్క టీచర్‌తోనే నిర్వహిస్తున్నారు. ఫలితంగా ఏకోపాధ్యాయ పాఠశాలల్లో చదువులు సక్రమంగా సాగడం లేదు. కొనకనమిట్ల మండలంలో 79 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అందులో 37 పాఠశాలల్లో 60 మంది వరకు ఉపాధ్యాయుల కొరత ఉంది. పాఠశాలల్లో పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు లేకపోవడంతో పిల్లల చదువు కుంటుబడుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ఉపాధ్యాయుల సమస్య తీర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతుండగా.. డీఎస్సీ నియామకాలు పూర్తయితేనే సమస్య పరిష్కారమవుతుందని ఎంఈఓ–2 నరసింహారావు చెబుతున్నారు.



గిద్దలూరు : ఐదుగురు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

చలో ప్రైవేట్ స్కూల్

గిద్దలూరు పట్టణ పరిధిలో మిట్టమీదిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కేవలం ఐదుగురు విద్యార్థులు నమోదయ్యారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడం, కిటికీలు, విద్యుత్ సరఫరా లేకపోవడం, తలుపులు లేకుండా నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు, పాఠశాల చుట్టూ చిల్లచెట్లు పెరగడం, సరైన మౌలిక వసతులు లేని కారణంగా తల్లిదండ్రులు తమ పిల్లలను పంపేందుకు ఇష్టపడ లేదు. 4వ తరగతిలో ముగ్గురు, 2వ తరగతిలో ఇద్దరు మాత్రమే చేరడంతో వారికి ఓ ఉపాధ్యాయుడు పాఠాలు చెబుతున్నారు. మిట్టమీదిపల్లె స్కూల్లో గత ఏడాది ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో ఒక టీచర్ పోస్టు కేటాయించారు. పాఠశాలల నిర్వహణను గాలికొదిలేయడంతోనే విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పట్టిందనడానికి ఇదే నిదర్శనం. ఇదిలా ఉండగా గ్రామంలో సుమారు 40 మందికి పైగా విద్యార్థులు గిద్దలూరులోని ప్రైవేటు పాఠశాలలకు ఆటోల్లో వెళ్తున్నారు. గిద్దలూరు మండలంలో మొత్తం 17 పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పట్టడంతో ఏకోపాధ్యాయులతో నిర్వహిస్తున్నారు.

బదిలీల అనంతరం సమస్య జటిలం

ప్రతి తరగతికి లేక 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండాలన్నది నిబంధన. కానీ పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఏకోపాధ్యాయులతో విద్యార్థుల చదువులు ముందుకు సాగడం లేదు. పలు పాఠశాలల్లో 20 మందికి పైగా విద్యార్థులు ఉన్నప్పటికీ ఒక్కరే టీచర్ ఉండటంతో పాఠాలు బోధించలేని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది జూన్‌లో పాఠశాలలు పునఃప్రారంభమైన తరువాత ప్రభుత్వం మోడల్ స్కూల్స్ అభివృద్ధి పేరిట 1 నుంచి 5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహిస్తోంది. ఆ వెంటనే టీచర్ల బదిలీలకు అవకాశం ఇవ్వడంతో ఇక్కడ పని చేసే వారు పక్క మండలాలకు వెళ్లారు. 50 శాతం మంది టీచర్లని మాత్రమే విధుల నుంచి రిలీవ్ చేయాల్సి ఉండగా నిబంధనలు పాటించని అధికారుల మూలంగా పాఠశాలలకు రావాల్సిన వారు మాత్రం రాలేదు. కొందరు టీచర్లు రిలీవ్ కావాల్సి ఉండగా వేరేవారు రాకపోవటంతో పని చేసే చోటే ఉండిపోవాల్సి వచ్చింది.



కొనకనమిట్ల : బచ్చచలకూరపాడు ఏఏ పాఠశాలలో 24 మందికి ఒక టీచర్



కొనకనమిట్ల : బచ్చలకూరపాడు ఏఏ పాఠశాలలో ఒక్క టీచర్, ఇరుకు గదిలో ఉండలేక బయట ఆడుకుంటున్న పిల్లలు

‘అభయ ది డెస్టినీ ఆఫ్ యూనివర్స్’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు, రచయిత అనిత

మార్కాపురం: అభయ అనే పదం ధైర్యానికి, నమ్మకానికి ప్రతీక అని హైకోర్టు న్యాయవాది ప్రముఖ కమ్యూనిస్ట్ నాయకుడు తోట సంగమేశ్వరరావు(సంగమ్) పేర్కొన్నారు. ఆదివారం మార్కాపురం పట్టణంలోని నెహ్రూ బజారులో డాక్టర్ పి.అనిత (న్యాయ విద్యార్థి) రచించిన అభయ ది డెస్టినీ ఆఫ్ యూనివర్స్ పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాది మాట్లాడుతూ.. మహిళలు ఏ సమస్య వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. అభయ అనే పదం విశ్వం మొత్తానికి అభయపూరితమైనటువంటిదన్నారు. మహిళలకు ఉపయోగపడే పుస్తకాన్ని రచించిన డాక్టర్ అనితను అభినందించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల లెక్చరర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా ఎల్లమ్మతల్లి ప్రతిష్ఠ ఉత్సవాలు



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు



అమ్మవారికి అభిషేకం చేస్తున్న కంకణధారులు

కొనకనమిట్ల: మండలంలోని ఐరసలగుండం గ్రామంలో నాగారపు ఎల్లమ్మతల్లి నూతన ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు కోలాహలంగా సాగుతున్నాయి. ఆదివారం వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ నవగ్రహారాధన, వాస్తు దేవతారాధన, జప హోమార్చన, పారాయణం, హోమాలు, క్షీరాధివాసం, సహస్రనామ పూజలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గోపిరెడ్డి ఆదెమ్మ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వేద పండితులు వీరవెంకటసత్యనారాయణశర్మ పర్యవేక్షణలో ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం గ్రామంలో ఎల్లమ్మతల్లి విగ్రహాన్ని ఊరేగించారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

కంభం: వృత్తుల్లో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో అర్ధవీడులోని ఎస్ఎస్ఆర్ఎం ఎయిడెడ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోగులదిన్నె వెంగళ్‌రెడ్డి పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుడిగా వెంగళ్‌రెడ్డి అందించిన సేవలు మరువలేనివని, 30 ఏళ్లపాటు లాభాపేక్ష లేకుండా విద్యార్థులకు అంకిత భావంతో విద్యను బోధించడంలో తనదైన పాత్ర పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో బేస్తవారిపేట ఎంపీపీ ఓసూరారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, గోగులదిన్నె బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదనపు లోడ్ క్రమబద్ధీకరణ గడువు పొడిగింపు

- విద్యుత్ ఏడీఈ సియా నాయక్ వెల్లడి



విద్యుత్ ఏడీఈ సియా నాయక్

మార్కాపురం: వినియోగదారులు తాము వాడుతున్న అదనపు విద్యుత్ లోడును క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఆ శాఖ మార్కాపురం ఏడీఈ సియా నాయక్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. గృహ విద్యుత్ వినియోగదారులకు మాత్రమే అదనపు లోడ్‌ను రెగ్యులర్ చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం వాడుతున్న అదనపు విద్యుత్‌కు కిలోవాట్ ఫీజులో 50 శాతం చెల్లిస్తే రెగ్యులర్ చేస్తామని పేర్కొన్నారు. గతంలో విద్యుత్ కనెక్షన్ తీసుకున్నప్పుడు చాలా మంది తక్కువ లోడ్ మాత్రమే డిపాజిట్ చేశారని, ప్రతి ఇంటిలో టీవీ, ఫ్రిజ్, కూలర్, ఏసీ, గీజర్, వాషింగ్ మిషన్ లాంటి గృహోపకరణాలు వాడుతున్నారని, దీని వల్ల అదనపు విద్యుత్ లోడ్ ఉపయోగిస్తున్నట్లేనని చెప్పారు. అదనపు లోడ్ వినియోగంపై తరచుగా తనిఖీలు నిర్వహిస్తామని, వాటిలో బయటపడితే జరిమానా వేస్తామని హెచ్చరించారు. ఒక కిలోవాట్‌ను రెగ్యులర్ చేసుకోవాలంటే 2250 ఉంటుందని, ప్రస్తుతం 1250 రూపాయలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఈ డిపాజిట్‌ను ఎలక్ట్రికల్ రెవెన్యూ ఆఫీసు లేదా ఏపీసీపీడీసీఎల్ వెబ్‌సైట్, మీసేవా కేంద్రంలో చెల్లించవచ్చని ఏడీఈ తెలిపారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. 1989లో పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలుసుకున్నారు. తమ స్నేహితుడు దొడ్డా రమేష్ ప్రారంభించిన విరాట్ ఇండస్ట్రీస్‌ను సందర్శించారు. చిన్ననాటి సంగతులు గుర్తుచేసుకుని సంతోషంగా గడిపారు. 36 ఏళ్ల స్నేహబంధం మధురానుభూతిని మిగిల్చిందని గుంటూరు పత్తిపాడు రోడ్‌లోని ఓ కాలేజి డైరెక్టర్ డీవీఎస్.ఫణికుమార్, రమేష్, సత్యం, చంద్ర, బాలాజి, ముక్కు శ్రీను, వెంకట్, రమణయ్య, గురవయ్య, కృష్ణ, రవి, బిజ్జాల పేర్కొన్నారు. వాడుకుని వదిలేసే బంధువుల కన్నా, ఆపదలో ఆదుకునే స్నేహితులే మిన్న అని విజయవాడ సాయి ట్రేడర్స్ అధినేత సీహెచ్ వెంకటసత్యనారాయణ చెప్పారు. ఏడాదికి ఒకసారి గెట్ టు గెదర్ ఏర్పాటు చేసుకుని కలుసుకోవాలని మిత్రులు నిర్ణయించుకున్నారు.



గెట్ టు గెదర్‌కు హాజరైన స్నేహితులు

పోలేరమ్మ తల్లికి బోనాలు



బోనాలు సమర్పిస్తున్న మహిళా భక్తులు

- పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు



భక్తులకు దర్శనమిస్తున్న పోలేరమ్మ తల్లి

మార్కాపురం టౌన్: పట్టణంలోని కళాశాల రోడ్డులో ఉన్న పోలేరమ్మ తల్లి ఆలయ తృతీయ వార్షికోత్సవం, శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని మహిళా భక్తులు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 4 గంటలకు అమ్మవారి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కమిటీ సభ్యులతోపాటు ప్రతినిధి ధారా చెన్నకేశవులు తదితరులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పట్టణ శివారులో అల్లూరి పోలేరమ్మ తల్లి ఆలయంలో భక్తులు ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకాగా ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.